క్లుప్తంగా

బీఎల్‌ఏలు, పార్టీ నాయకులతో సమావేశం



వస్త్రాలు పంపిణీ చేస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో గురువారం సీతంపేట వెన్నెల ఫంక్షన్ హాల్‌లో వార్డుకు చెందిన పోలింగ్ బూత్ ఏజెంట్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల వేళ నిర్వర్తించాల్సిన బాధ్యతలపై బీఎల్‌ఏలకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కె.కె.రాజు సంక్రాంతి కానుకగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి మురళీకృష్ణారెడ్డి, డైరెక్టర్లు నూకరాజు, ఎస్.సురేష్, బి.గోవింద్, మువ్వల సంతోష్, సారిపల్లి సంతోష్, హరికృష్ణ, శ్రవన్, అశోక్‌బాబు, పద్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ సీతంపేట, 11 కేవీ గురుద్వారా ఫీడర్లలో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సీతంపేట మెయిన్ రోడ్డు, విజయ హాస్పిటల్, గురుద్వారా, శాంతిపురం, జీవీకే ప్లాజా, రమా హాస్పిటల్, రిలియన్స్ పెట్రోల్ బ్యాంక్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రాధాకృష్ణా లేఅవుట్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను గురువారం ఫోర్త్ టౌన్ సీఐ ఎస్.విజయకుమార్, ఎస్‌ఐ వెంకటరావులు పరిశీలించారు. 14వ వార్డు రాధాకృష్ణా లేఅవుట్‌లోని ప్రెసిడెన్సియల్ స్కూల్, లలితానగర్‌లోని జి.వి.కె.స్కూల్, తాటిచెట్లపాలెం ఉర్దూ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన వసతులపై స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి ఆరా తీశారు. విద్యుత్, తాగునీరు, వసతి, ఫ్యాన్లు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ ఏఎస్‌ఐ గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక సూర్యనమస్కారాలు

ఎంవీపీకాలనీ: ఓం ఉచిత యోగా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమం జరుగుతుందని సంస్థ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ వేదికగా ఉదయం 5 గంటల నుంచి 108 రౌండ్స్ పాటు సూర్యనమస్కారాలు నిర్వహిస్తామని చెప్పారు.

గోవా గవర్నర్ రాక నేడు

మహారాణిపేట: గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లాయ్ శుక్రవారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి శుక్రవారం ఉదయం 8.20 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. కొద్ది సేపు విశ్రాంతి అనంతరం భోగాపురంలో ఉన్న సన్ రే రిసార్ట్స్‌కు వెళ్తారు. అక్కడ జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొని అనంతరం తిరిగి విశాఖ చేరుకుంటారు. సాయంత్రం 4.15 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళ్తారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు



ప్రజా సమస్యలు నమోదు చేసుకుంటున్న కె.కె.రాజు

కంచరపాలెం: నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. 55వ వార్డు కంచరపాలెం పరిధి ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో గురువారం కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళతో కలిసి ఆయన పర్యటించారు. ధర్మానగర్‌లో సుమారు రూ.1.23 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు కె.కె.రాజు సూచించారు. సామాజిక భవన నిర్మాణం పూర్తయిందని, త్వరలో ప్రారంభిస్తామని స్థానికులతో చెప్పారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వార్డులో పర్యటించి స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 ఇంజినీరింగ్ డీఈ భరణికుమార్, ఏఈ చాణక్యబాబు, పార్టీ వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్, గంగామహేష్, బద్రి, దాసు, కరుణ, లక్ష్మీదేవి, గౌష్, సతీష్, ధర్మేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక బస్ బేల ప్రారంభం

సీతమ్మధార: జీవీఎంసీ 14, 44, 45 వార్డుల పరిధిలో కొత్తగా నిర్మించిన నాలుగు బస్ బేలను గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్-16 అక్కయ్యపాలెం జంక్షన్ వద్ద రెండు(నార్త్, సౌత్), పోర్టు హాస్పిటల్ జంక్షన్ వద్ద రెండు(నార్త్, సౌత్) ఆధునిక బస్ షెల్టర్లను రూ.1.07 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బస్ బేల వద్ద అన్ని వసతులను కల్పించిందన్నారు. ప్రయాణికులు కూర్చునేందుకు సిమెంటు బెంచీలతోపాటు మరుగుదొడ్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ముందుగా జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుల ఆధ్వర్యంలో కె.కె.రాజు కొబ్బరికాయ కొట్టి బస్ బేలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ రమణమ్మ, ఉమామహేశ్వరావు, హరిపట్నాయక్, కిరణ్‌రాజు, హబీబ్, కె.సత్యనారాయణ, గోపి, నాగరాజు, కన్నప్పుడు, ఆదిలక్ష్మి, పి.శ్రీను, తులసి తదితరులు పాల్గొన్నారు.



బస్ బేను ప్రారంభిస్తున్న కె.కె.రాజు

ఫిజియోథెరపీతో ఆరోగ్య పరిరక్షణ



ఆసనాల ద్వారా ఫిజియోథెరపీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీరామ శ్రీనివాస్

మురళీనగర్: ఫిజియోథెరపీ ద్వారా కీళ్లు, కండరాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ పి.శ్రీరామ శ్రీనివాస్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కీళ్లు-కండరాల ఆరోగ్యానికి అవసరమైన వ్యాయామాలను, ఆసనాలను వేశారు. వయసు మళ్లినవారు చేయాల్సిన సులభతరమైన వ్యాయాలను వేసి చూపించారు. వాకర్స్ తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామ శ్రీనివాస్‌ను వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, పూర్వ అధ్యక్షులు ఆర్.సత్యనాథం, ఎస్.బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం

మురళీనగర్: అర్హత గల ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందులో వార్డు వలంటీర్లు కీలకంగా వ్యవహరించాలని డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు అన్నారు. వార్డు 281 సచివాలయం వలంటీర్లు, స్థానిక నాయకులతో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల నిర్వహణపై ఆయన ఆధ్వర్యంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో వార్డులో అభివృద్ధి పనులను చకచకా నిర్వహిస్తున్నామని తెలిపారు. కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామన్నారు. అర్హత కలిగి సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు మంజూరు కాని వారి వివరాలు సేకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేసేందుకు వలంటీర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజుల డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, విశాఖ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, వార్డు సీనియర్ నాయకులు జనపరెడ్డి వెంకటరావు, స్థానిక సీనియర్ నాయకుడు శ్రీరాములు, సచివాలయ కన్వీనర్ పల్లా చైతన్య, వార్డు సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

'సెయింట్ జోసెఫ్' విద్యార్థినికి బంగారు పతకం



హర్షశ్రీ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బీబీసీ ఫైనల్ ఇయర్ చదువుతున్న కడలి హర్షశ్రీ అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియంలో జరిగిన నిజి షాటోకాన్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2024లో బంగారు పతాకం సాధించింది. ఈ మేరకు గురువారం కళాశాల సెమినార్ హాల్లో విజేత హర్షశ్రీని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ఎంవీ రమణ, అధ్యాపకులు డాక్టర్ పి.కె. జయలక్ష్మి, డాక్టర్ అనుపమ, డాక్టర్ వీరబ్రహ్మం, డాక్టర్ మౌసమి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వెలమలకు ప్రాధాన్యం కల్పించాలి



సంఘీభావం తెలుపుతున్న వెలమ సంక్షేమ సంఘాల నాయకులు

సీతమ్మధార: రాష్ట్రంలోని వెలమ సామాజిక వర్గానికి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 23 అసెంబ్లీ, 5 పార్లమెంట్ స్థానాల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని వెలమ కుల సంక్షేమ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వెలమ సంక్షేమ భవనంలో సంఘ సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చినబాబు ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రంలోని వివిధ వెలమ సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల వెలమ కులస్తుల జనాభా ఉన్నామని, మరో నాలుగైదు రోజుల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆరు ఎమ్మెల్యే స్థానాలు కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నట్లు చెప్పారు. విశాఖ అర్బన్ జిల్లాలోని ఉత్తర, దక్షిణ, గాజువాక, భీమిలి, నియోజకవర్గాల్లో రెండు అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. వెలమ సామాజిక వర్గానికి ప్రాధాన్యమివ్వలేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు గంట అప్పలనాయుడు, బంగారు రామకృష్ణ, కూనురెడ్డి శ్రీనివాసరావు, గుణుపూర్ రామారావు, గొట్టాపు చిన్నమనాయుడు, బొత్స వరప్రసాద్, కొండ్రేపు సోమేశ్వరరావు, బొమ్మనేని తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

4,157 మందికి 'ఆరోగ్య సురక్ష' సేవలు

మహారాణిపేట: రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు గురువారం అర్బన్ పరిధిలో 10 ప్రాంతాల్లో జరిగాయి. సాగర్‌నగర్, ఎంఎస్ఆర్ లేఅవుట్, ఎన్‌జీజీవో కాలనీ, భీమనగర్‌లో రెండు చోట్ల, రైల్వే న్యూకాలనీ, అంబేడ్కర్ కాలనీ, పెద గంట్యాడ, సిద్ధేశ్వరం, చంద్రనగర్, తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ శిబిరాల్లో మొత్తం 4,157 మందికి వైద్య సేవలు అందజేశారు. వీరిలో ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫరల్ చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరగనుందని పేర్కొన్నారు.

జ్ఞానం, నైపుణ్యాలే నిజమైన సంపద

ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: మార్కుల కోసం మథన పడవద్దని, జ్ఞానం, నైపుణ్యాలే జీవితంలో నిజమైన సంపదగా నిలుస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపుస్మ) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో గురువారం ఏయూ స్నాతకోత్సవం మందిరంలో స్టూడెంట్ ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్ఈపీ) నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మంచి సమాజం నిర్మించడంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మానసిక సన్నద్ధత, సానుకూల దృక్పథంతో పనిచేస్తే విజయం సులభంగా చేరువవుతుందన్నారు. విద్యార్థి కుటుంబ నేపథ్యం, నివసించే ప్రాంతం, మాధ్యమం వంటివి అతడి ప్రగతికి ఎంతమాత్రం అవరోధాలుగా నిలవవనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థులు తమ మస్తిష్కాల్లో నింపుకునే జ్ఞానమే ఉన్నతిని నిర్ణయిస్తుందన్నారు. సాధారణ కుటుంబాల వారు కూడా అసాధరణ వ్యక్తులుగా ఎదగవచ్చని చెప్పారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయండి

ఇటీవల కాలంలో స్టార్టప్ కల్చర్ బాగా పెరిగిందని వీసీ ప్రసాదరెడ్డి అన్నారు. సమాజ ఉపయుక్త ఆలోచనలే వ్యాపార అవకాశాలుగా మారుతాయన్నారు. ప్రతీ వ్యక్తి ప్రత్యేకమని, ఒక్కొక్కరికి ఒక్కో విధమైన సామర్థ్యాలు కలిగి ఉంటారన్నారు. రానున్న ఏడేళ్ల కాలం విద్యార్థి జీవితంలో ఎంతో ప్రధానమైనదన్నారు. ఇక్కడ కష్టపడితే తరువాతి ఐదు దశాబ్దాలు ఉన్నతమైన జీవితాన్ని పొందడం సాధ్యపడుతుందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు తమ సంతోషాలను, బాధలను తల్లిదండ్రులతో పంచుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆత్మస్థైర్యంతో పరీక్షలకు హాజరు కావాలని, ఎన్ని మార్కులు వచ్చినా సానుకూలంగా స్వీకరించే తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఏయూ వీసీని డీఈవో ఎల్.చంద్రకళ తదితరులు సత్కరించారు. కార్యక్రమానికి 3 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు పలు రంగాల్లో వ్యక్తిత్వ వికాస నిపుణులతో అవగాహన, ప్రేరణ కలిగించే ప్రసంగాలను అందించారు. అపుస్మ రాష్ట్ర రాష్ట్ర ముఖ్య మార్గదర్శి ఎ.కృష్ణారెడ్డి, రాష్ట్ర కోశాధికారి ఎం.వి రావు, అధ్యక్షుడు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.వి.వి.సత్యనారాయణ, కోశాధికారి జి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



ఏయూ వీసీ ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న డీఈవో చంద్రకళ

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజతో పాటు అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిషికకు ఘన సత్కారం

తాటిచెట్లపాలెం: ఇటీవల ఢిల్లీలో జరిగిన కళా ఉత్సవ్‌లో కేంద్రీయ విద్యాలయ వాల్తేర్ కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పిన 10వ తరగతి విద్యార్థిని జి.రిషికను గురువారం విద్యాలయంలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆఫ్ వైజాగ్ (జేసీఐ వైజాగ్) సభ్యులు ఘనంగా సత్కరించారు. విద్యార్థులు చదువుతోపాటు ప్రత్యేక కార్యక్రమాల్లో శిక్షణ పొంది రాణించాలని సభ్యులు ఆకాంక్షించారు. రిషికతోపాటు కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్, మ్యూజిక్ టీచర్ డాక్టర్ త్యాగరాజ్‌లను వీరు సత్కరించారు. కార్యక్రమంలో జేసీఐ సభ్యులు ప్రభాకర్, ధరిష్మ, కావ్య, కుందన్‌లాల్, నాగమణి, ప్రధానోపాధ్యాయిని వి.ఎం.శైలజ, సీనియర్ ఉపాధ్యాయిని రేఖ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని రిషికను సత్కరిస్తున్న జేసీఐ వైజాగ్ సభ్యులు

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో నియామకాలు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ జిల్లాలోని పలు విభాగాల అనుబంధ కమిటీల్లో వివిధ హోదాల్లో ఉత్తర నియోజకవర్గానికి చెందిన నాయకులను నియమించారు. వివరాలిలా..

బీసీ సెల్..
జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా బొడ్డేటి గంగా మహేష్, సెక్రటరీలుగా కె.రామ వెంకట నర్సింహకుమార్, బెవర రాజేశ్వరరావు, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.చంద్రశేఖర్, కోడూరు సత్యనారాయణ, బొంగు ఈశ్వరరావు, కోరాడ రాంబాబు, సూరాడ పెంటరావులను నియమించారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్..
క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీ జనరల్ సెక్రటరీగా కొండపల్లి చిట్టితల్లి, సెక్రటరీలుగా జామి కరుణ (జెస్సీ), గంట్యాడ రూపావతి, జాయింట్ సెక్రటరీలుగా వా.అజయ్‌కుమార్, ఎం.చిన్నాలను నియమించారు.

ఐటీ వింగ్..
జిల్లా ఐటీ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా కొట్యాడ సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీగా ఎస్.కిశోర్ వర్మ, సెక్రటరీలుగా టి.మహేష్‌బాబు, బోయ రాజశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా జగదీష్‌ను నియమించారు.

మహిళా విభాగం..
జిల్లా మహిళా విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఇ.వరలక్ష్మి, జనరల్ సెక్రటరీగా పప్పల సునీత, సెక్రటరీలుగా పి.అమ్మాజి, మెట్ట దమయంతి, జాయింట్ సెక్రటరీలుగా కొల్లి రమణమ్మ, బందారు పావని, పిల్లరి శెట్టి సుజాత, సాసుపల్లి రాజకుమారి, ఆశి లక్ష్మి నియామకమయ్యారు.

మైనార్టీ విభాగం..
జిల్లా మైనార్టీ విభాగం ప్రెసిడెంట్‌గా కె.వి.బాబా, జనరల్ సెక్రటరీగా ఎస్.అబ్బాస్, సెక్రటరీలుగా షేక్ బాబ్‌జాన్, షేక్ నవాబ్, షేక్ రెహ్మాన్, జాయింట్ సెక్రటరీలుగా మహ్మద్ కరీం, షేక్ నూర్ అహ్మద్‌లను నియమించారు.

ఎస్సీ సెల్ విభాగం..
జిల్లా ఎస్సీ సెల్ విభాగం జనరల్ సెక్రటరీగా ఈదల సిద్ధార్థ రాజు, సెక్రటరీగా ఎల్లబిల్లి వర వెంకటదుర్గా నర్సింహప్రసాద్, జాయింట్ సెక్రటరీగా దొండపర్తి లక్ష్మీరావు, తాటిపూడి రత్నంలను నియమించారు.

ఎస్టీ సెల్ విభాగం..
జిల్లా ఎస్టీ సెల్ విభాగం జనరల్ సెక్రటరీగా జె.బాలనాయక్, సెక్రటరీలుగా నల్లాబత్తుల సతీష్, నల్లాబత్తుల యేసు, జాయింట్ సెక్రటరీలుగా నల్లాబత్తుల అరుణ, నల్లాబత్తులు శాంతి కుమారిలను నియమించారు.

చేనేత విభాగం..
జిల్లా చేనేత విభాగం జనరల్ సెక్రటరీగా కొడిదాసు ఆనందరావు, సెక్రటరీలుగా శీరపు తిరుపతిరావు, జి.రాజు, జాయింట్ సెక్రటరీలుగా టి.సాయి, ఐ.సతీష్‌కుమార్‌లను నియమించారు.

యూత్ విభాగం..
జిల్లా యూత్ విభాగం ప్రెసిడెంట్‌గా ఆళ్ల లక్ష్మణ జయ శివగణేష్, జనరల్ సెక్రటరీగా మువ్వల సంతోష్, సెక్రటరీగా వి.శివప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా బి.శ్రీనివాసరావు, జాగరపు నర్సింగరావులను నియమించారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



అంగన్‌వాడీ పోషకాహార స్టాల్ వద్ద కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం రెండో రోజు గురువారం కొనసాగింది. 290 గాంధీనగర్-3 సచివాలయం పరిధికి చెందిన 100 మందికి పైగా రోగులు పలు ఆరోగ్య సమస్యలతో వచ్చి వైద్య, రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఆర్థో పెడిక్, గైనిక్, కంటి, సాధారణ డాక్టర్లు అందుబాటులో ఉండి వైద్యం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు వైద్య శిబిరాన్ని సందర్శించి, ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. వైద్య శిబిరం వద్ద ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ పోషకాహార స్టాల్‌ను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించి, వైద్య పరీక్షల వివరాలు తెలుసుకున్నారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

మద్దిలపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం కుల వివక్ష పోరాట సమితి క్యాలెండర్‌ను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా కేవీపీఎస్ అనేక పోరాటాలు చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కార్మికులు, ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్, సీఐటీయూ నాయకులు కూన వెంకటరావు, కంచరపాలెం డీవైఎఫ్‌ఐ నాయకులు సనపల శ్రావణ్‌కుమార్, పొన్నాడ అప్పారావు, పప్పల శ్రీదేవి, జనార్దన్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ తదితరులు

రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన

కంచరపాలెం: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ, ఎన్‌సీసీ యూనిట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోలీస్(ట్రాఫిక్) ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం పాత ఐటీఐ జంక్షన్‌లోని పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ) కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఆర్.సిహెచ్.శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఐ.రఘుబాబులు మాట్లాడుతూ భద్రతా నియమాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం వాకథాన్ నిర్వహించారు. రోడ్డు భద్రతా నిబంధనల పాటిస్తామని ప్రతి విద్యార్థి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి గణేష్‌రెడ్డి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ యు.ఉమాశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారి

ఇద్దరు అదృశ్యం

సీతమ్మధార: సీతంపేట రాజేంద్రనగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల అదృశ్యంపై ద్వారకా పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతంపేట రాజేంద్రనగర్‌లో గొంప గణేష్ అనే వ్యక్తి భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. కంచరపాలెం రైతుబజారు ఎదురుగా మందుల దుకాణంలో కొంత కాలంగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆత్మహత్య చేసుకుంటానని గదిలో లెటర్ పెట్టి వెళ్లిపోయాడు. లెటర్ చూసిన భార్య కృష్ణకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- సీతంపేట రాజేంద్రనగర్‌లో నివసిస్తున్న జి.లక్ష్మణ అనే వృద్ధుడు ఈ నెల 13న తన కుమారుడు సత్యనారాయణ ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. పలువురు స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లి అడగ్గా రాలేదని చెప్పడంతో.. కుటుంబ సభ్యులు ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



గొంప గణేష్



జి.లక్ష్మణ